క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

గాజువాక: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ద్విచక్ర వాహన మెకానిక్ గొల్లపల్లి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రగతి టూ వీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ సభ్యుల నుంచి సేకరించగా వచ్చిన రూ.45,200 నగదును మృతుని భార్య నాగమణికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.దామోదరరావు, వంగపండు గణేష్, రెడ్డిపల్లి రాజు, సమ్మిడి పైడిరాజు, బి.శ్రీనివాసరావు, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న రమణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, రామారావు, నరసింగరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సర్

హౌస్ కమిటీ సమస్య పరిష్కారంపై కృతజ్ఞతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పాత గాజువాకలో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా చూడాలని విన్నవించారు.

ఎల్‌వీ నగర్‌లో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు వద్ద బాధితులు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులో ఎల్‌వీ నగర్‌లో ఒక పూరిల్లు దగ్ధమైంది. ఈ సంఘటనలో రూ.50వేల ఆస్తినష్టం చోటుచేసుకున్నట్టు బాధితులు తెలిపారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ శానిటరీ విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికురాలిగా పని చేస్తున్న సోమాదుల లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఆ పూరింట్లో నివాసముంటోంది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి, ఇల్లు దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరావడం లేదు. ఈ ప్రమాదంలో టీవీ, రిఫ్రిజిరేటర్, గ్రైండర్, బీరువా, బట్టలు, పట్టుచీరలు దగ్ధమైనట్టు తెలిపారు. సమాచారం అందుకున్న గాజువాక మండల రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి బాధితులకు న్యాయం చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.త్రినాథరావు తెలిపారు. కార్పొరేటర్ ఉరుకూటి చందు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందడంతో రోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైద్యం వ్యాపారమై.. కార్పొరేట్ సంస్థల గుప్పిట్లో చిక్కిన వేళ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి, స్పెషలిస్ట్ వైద్యులను నియమించడంతో సంతృప్తి వ్యక్తమవుతోంది. అత్యాధునిక వైద్య సదుపాయాలయాలతో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సేవలు బాగున్నాయంటూ ప్రశంసల జల్లు కురుస్తోంది.

- డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆధునిక సదుపాయాలు
- స్పెషలిస్ట్ వైద్యుల నియామకంతో తగ్గిన దూరాభారం
- ఆస్పత్రిలో చికిత్స, వసతులపై రోగుల హర్షం



గంగవరంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రంలో సిద్ధం చేసిన బెడ్స్



అత్యాధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్

పెదగంట్యాడ: ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వేలల్లో బిల్లులు వేసే ప్రైవేట్ ఆస్పత్రుల గడప తొక్కాలంటేనే భయపడుతున్న పేద, మధ్యతరగతి వారికి ఆధునిక సదుపాయాలతో ఏర్పాటైన ప్రభుత్వ ఆస్పత్రులు ఎంతో భరోసానిస్తున్నాయి. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలు, ఇన్‌పేషెంట్ వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని రోగులు చెబుతున్నారు. సేవలు బాగుండడంతో రోగుల తాకిడి పెరిగింది. రోజూ 100 మందికి పైగా రోగులు ఇక్కడికి వైద్యసేవల కోసం వస్తున్నారు. నిత్యం వైద్యులు అందుబాటులో ఉండడంతో పాటు అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన చికిత్సలు అందజేస్తుండడంతో స్థానికంగా ఉంటున్న వారు ప్రైవేటు ఆస్పత్రులను పక్కన పెడుతున్నారు. ఇక్కడే తమకు కావాల్సిన వైద్య పరీక్షలు, చికిత్స చేయించుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. పంటి నొప్పి వచ్చినా, కంటి సమస్యలున్నా ఇక్కడే వాటికి చికిత్స చేస్తున్నారు. వైద్య నిపుణులు వచ్చిన రోజు ఓపీ సంఖ్య 100 నుంచి 120 మంది రోగులు వస్తున్నారు. ఆరోగ్య శ్రీ పరీక్షలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఉచితంగానే రక్తపరీక్షలు చేస్తున్నారు. మందులు అందజేస్తున్నారు. గంగవరం ప్రాంతానికి చెందిన ప్రజలంతా ఇక్కడ వైద్యం పొందుతున్నారు. ఈ కేంద్రానికి వచ్చిన రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆస్పత్రి సిబ్బంది తగు చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సేవలందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉంటూ నిర్విరామంగా సేవలందిస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్యులు

జనరల్ వైద్యులతో పాటు వారానికోరోజు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారు.

రోజు	స్పెషలిస్ట్ వైద్యులు
సోమవారం	ఈఎన్‌టీ
మంగళవారం	గైనకాలజీ
బుధవారం	జనరల్ సర్జరీ
గురువారం	జనరల్ మెడిసిన్
శుక్రవారం	ఆర్థోపెడిక్
శనివారం	డెర్మటాలజీ



వైద్య పరీక్షల కోసం అత్యాధునిక ఎక్విప్‌మెంట్

వైద్య సేవలు బాగున్నాయి

ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయి. వైద్యులు, సిబ్బంది చిరునవ్వుతో పలకరిస్తున్నారు. విసుక్కోకుండా, ఆరోగ్య సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకుంటున్నారు. మంచి వైద్యం అందిస్తున్నారు. మందులు ఇస్తున్నారు. నేను తరచూ సుగర్, బీపీ చెక్ చేయించుకుని మందులు తీసుకుంటున్నాను.

– గరికిన నూకరత్నం, గంగవరం

బాగా చూస్తున్నారు..



ఇక్కడ ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. అనారోగ్యంతో వచ్చిన మమ్మల్ని బాగా చూస్తున్నారు. రక్తపరీక్షలు చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు. ఒంట్లో ఏమాత్రం బాగా లేకపోయినా మళ్లీ రమ్మని చెబుతున్నారు.

–పేర్ల అమ్మోరమ్మ, గంగవరం

రోజూ 100కు పైగా ఓపీ



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన నాటి నుంచి రోజూ 100 నుంచి 120 మంది వరకు రోగులు వస్తున్నారు. కేంద్రంలో సేవలను వినియోగించుకుంటున్నారు. ఎమర్జెన్సీ అయితే అగనంపూడి గానీ, కేజీహెచ్‌కు గానీ రిఫర్ చేస్తున్నాం. – డాక్టర్ వినయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ, గంగవరం

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



ఫార్మాసిటీ కాలనీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున ఎమ్మెల్యే నాగిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ చందు



బీజేపీ నాయకులతో మాధవ్ భార్య మాధురి

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి, ఓటు అభ్యర్థించారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, హెచ్‌ఎం అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

- సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 88వ వార్డు వెదుళ్లనరవలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనకమహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.
- కూర్మన్నపాలెం: 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బందిని కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం

పెదగంట్యాడ: ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 64వ వార్డు దిబ్బపాలెంలో ధర్మాల శ్రీను, 76వ వార్డు నడుపూరులో దొడ్డి రమణ, 65వ వార్డు నేతాజీ కాలనీ, సంజీవకాలనీల్లో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రచారం చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

గాజువాక: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు కోరారు. వార్డులోని ట్వింకిల్ స్కూల్, భాస్కర్ విద్యానికేతన్‌లలో ఉపాధ్యాయులను కలిసి సుధాకర్‌కు మద్దతుగా పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు.

టీడీపీ ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని కోరుతూ 75వ వార్డు నెల్లిముక్కులో పార్టీ నాయకులు ప్రచారం చేశారు. పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాధవ్ సతీమణి ప్రచారం

గాజువాక: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన భార్య మాధురి గాజువాకలో శనివారం ప్రచారం చేశారు. 70వ వార్డు శ్రామికనగర్‌లోని బీజేపీ ఎన్నికల ప్రచార కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. బీజేపీ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

భద్రతకు పునరంకితమవుదాం

స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్



భద్రతా దినోత్సవంలో ప్రసంగిస్తున్న సీఎండీ భట్

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రతి ఉద్యోగి, కార్మికుడు సురక్షితంగా పనిచేసే విధంగా పునరంకితం కావాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ పిలుపునిచ్చారు. ఉక్కు కర్మాగారంలో భద్రతతో ఉత్పత్తిని మెరుగుపర్చడంలో సహాయం కోసం స్టార్టప్‌లను ఆహ్వానించినట్టు తెలిపారు. ప్లాంట్‌లో శనివారం నిర్వహించిన 52వ జాతీయ భద్రతా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ డిజిటలైజేషన్ వైపు మరో ముందడుగు వేశామని, అందులో భాగంగా పరిశ్రమలో కల్పతరు ప్రాజెక్టును ప్రారంభించామని చెప్పారు. భద్రతకు డ్రోన్ల వినియోగం, డిజిటలైజేషన్ మొదలైన తాజా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతోందని చెప్పారు. ప్రమాదాలు లేని పరిశ్రమను సాధించడానికి ప్రతి ఒక్కరూ భద్రతా నియమావళిని పాటించాలని కోరారు. పరిశ్రమల డైరెక్టర్ డీసీఎస్ వర్మ మాట్లాడుతూ భద్రత కోసం స్టీల్‌ప్లాంట్ చేపట్టిన చర్యలను అభినందించారు. భద్రత ప్రాముఖ్యతను ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. మెరుగైన పర్యవేక్షణ, భద్రత కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ, రోబోటిక్స్, డ్రోన్ వంటి టెక్నాలజీని ఆచరణలో పెట్టాలని సూచించారు. భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కె.మహంతి, ఎ.కె.బాగ్చి, సీజీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ విదేశాల నుండి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని ప్రజలను మోసం చేయడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల బలిదానాలతో సిద్ధించిన పరిశ్రమలను కాపాడుకుంటే దేశానికి మంచి చేసిన ట్లేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 751వ రోజుకు చేరుకున్నాయి. దీక్షాశిబిరంలో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం సోర్ట్స్ విభాగాల కార్మికులు కూర్చుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలుగా నడిపించాలని కోరారు.

భెల్ త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



కార్యదర్శి వెంకటరాజుకు మినిట్స్ బుక్‌ను అందజేస్తున్న మేనేజర్ వెంకటరమణారావు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్ఈఎల్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పాలక సభ్యులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ నూతన అధ్యక్షుడు కె.రాము నాయుడు మాట్లాడుతూ ఉద్యోగులకు మెరుగైన రుణసదుపాయాలను కల్పిస్తామన్నారు. నూతన కార్యదర్శి ఎం.వెంకట రాజుకు సొసైటీ మేనేజర్ గవర వెంకటరమణారావు మినిట్స్ బుక్‌ను అందజేసి పదవీబాధ్యతల స్వీకరణ సంతకాలను తీసుకున్నారు. ఉపాధ్యక్షుడు కె.ధర్మారావు, నూతన డైరెక్టర్లు జి.టి.పి.ప్రకాష్, జి.ప్రసాద్, కె.ఎస్.వి.ప్రసాద్, ఎస్.బి.ప్రశాంత్ కుమార్, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన



ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గాజువాక: మహిళల ఆరోగ్యంపై 66వ వార్డు ఇందిరా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులు వివరించారు. యుక్తవయసు గల బాలికలు, గర్భిణులు, బాలింతలు, నెలసరి ఆగిపోయిన మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు రోజువారీ తీసుకునే ఆహారంలో పోషకాలు అధికంగా ఉండే విధంగా సూచించారు. రాగి పిండితో కూరగాయల సూప్ వంటివి తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మహిళా మండలి ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉష, జాయ్, మంగ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి ప్రణాళిక



సమావేశంలో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు

గాజువాక: నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాలపై వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు శనివారం చర్చించారు. గాజువాక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి జి.పూర్ణానంద శర్మ ఆధ్వర్యంలో సమావేశమైన నాయకులు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం వార్డుల వారీగా నిర్వహించాల్సిన ప్రచారంపై ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, ఎస్ఎండీ గౌస్, కె. మంగరాజు, వాడపల్లి రామచంద్రరాజు పాల్గొన్నారు.


జిల్లా వైద్యాధికారి పీహెచ్‌సీ సందర్శన



గాజువాక పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

గాజువాక: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గాజువాక పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ వైద్యాధికారులు, సిబ్బంది హాజరు రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని గదులన్నీ పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల గదిని తనిఖీ చేసిన అనంతరం మందులకు సంబంధించిన రికార్డులను, చిన్నపిల్లలకు సంబంధించిన వ్యాక్సిన్లను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణతో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. పీహెచ్‌సీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మ, సామాజిక వైద్యాధికారి పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు

ఉక్కునగరం (గాజువాక): కూర్మన్నపాలెం ప్రధాన మార్గంలో శనివారం ఒక కారు ప్రమాదానికి గురైంది. కూర్మన్నపాలెం నుంచి కణితి జంక్షన్ వెళ్లే మార్గంలో ప్రయాణిస్తున్న కారు ఒక చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జయింది. అయితే కారులో ప్రయాణిస్తున్నవారు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

అగనంపూడి: ప్రతీ విద్యార్థి ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. మనం ప్రతీ రోజు తీసుకుంటున్న ఆహారం, నీరు, గాలి కలుషితం అవుతున్న క్రమంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. రోజూ వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, వైద్యులు కె.రమేష్ చంద్ర, డాక్టర్ సుధ పద్మశ్రీ, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డబ్ల్యూఈపీ సెల్ డీన్ మృదులా దేవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.